సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం | 26 | ఆగస్టు | 2025



బీపీఎంలకు కొత్తఫోన్లు

ప్రభుత్వం చేయూత లబ్ధిదారులకు బీపీఎంల ద్వారా పింఛన్ అందజేస్తోంది. తాజాగా ఫేస్ రికగ్నిషన్ అమలు నేపథ్యంలో వారికి కొత్త సెల్‌ఫోన్లు అందజేయనుంది. 8లో▸



ఆర్జీయూకేటీలో ముగిసిన వర్క్‌షాప్

బాసర ఆర్జీయూకేటీలో ఎలక్ట్రిక్ వాహనాలపై మూడు రోజులు నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. 75 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/24.0

ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

'పంట నష్టంపై విపక్షాలది అనవసర రాద్ధాంతం'



మాట్లాడుతున్న భోజారెడ్డి

కైలాస్‌నగర్: జిల్లాలో పంటనష్టంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజాసేవభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసినవర్షాలకు జిల్లాలో దాదాపు 20వేల ఎకరాల మేర పంట నష్టం వాటిల్లిందన్నారు. ఈ మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవల పర్యటించారన్నారు. నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారన్నారు. అయినా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఈ విషయంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గతంలో ఇలాంటి వైపరీత్యాల సమయంలో గత పాలకులు రైతులను కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

అవగాహనతోనే టీబీ నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

సాత్నాల: అవగాహనతోనే టీబీ నియంత్రణ సాధ్యమని జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత అన్నారు. భోరజ్ మండలం గిమ్మ గ్రామంలో సోమవారం క్షయ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 135 మంది అనుమానితులను పరీక్షించినట్లు తెలిపారు. తెమడతో కూడిన దగ్గు, రెండు వారాలకు పైగా జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ అలర్ట్ ఇండియా, సాతి ఎన్జీవో రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ జేమ్స్ రాజు, మహేందర్, తిరుపతి, సుశీల మెడికల్ ఆఫీసర్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



డీఎంఈకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న బయో కెమిస్ట్, డైటీషియన్లకు పదోన్నతులు కల్పించాలని ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈమేరకు డీఎంఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిజాం, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ల్యాబ్‌టెక్నీషియన్లు తదితరులున్నారు.

'స్పాట్'కు దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: డీసెట్ స్పాట్ అడ్మిషన్ ఫేస్-2 కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. ఖాళీల వివరాలు డీసెట్ వెబ్‌సైట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈనెల 26న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాయంత్రం 5 గంటల వరకు సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో ఈనెల 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్రీడా పోటీల్లో 'వ్యవసాయ' విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, త్రోబాల్ పోటీల్లో టి.మానస, 400 మీటర్ల రిలే పరుగులో తేజశ్రీ, మనస్వి, శ్రావణి, అక్షయ్ పతకాలు సాధించారు. అలాగే వాలీబాల్‌లో కళాశాల జట్టు రెండో స్థానంలో నిలిచిందని కళాశాల ప్రొఫెసర్ జి.మంజులత తెలిపారు. ఇందులో డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, అథ్లెటిక్స్ కోచ్ రమేశ్, వ్యవసాయకళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

యూరియా.. ఆందోళన



ఇచ్చోడ పీఏసీఎస్‌లో రైతుల రద్దీ



నార్నూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు



సిరికొండలో టోకెన్ కోసం బారులు తీరిన రైతులు

జిల్లా రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. పీఏసీఎస్‌ల ఎదుట గంటల తరబడి నిరీక్షించినా చాలామందికి ఎరువు లభించని పరిస్థితి. వేకువజామునే వచ్చినా ఫలితం ఉండడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం వెంటనే స్పందించాలని నార్నూర్‌లో బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది.

ఇచ్చోడలో వేకువజాము నుంచే బారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని యూరియా వచ్చిందని సమాచారం అందగానే రైతులు సోమవారం ఉదయం 6 గంటల నుంచే సహకార సంఘం వద్ద బారులు తీరారు. 444 బ్యాగులు వచ్చినట్లు సీఈ వో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. అయితే ఉదయం నుంచి క్యూలో ఉన్నా కొంత మందికి యూరియా లభించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

నార్నూర్‌లో బీఆర్ఎస్ నిరసన

నార్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. దాదాపు గంటసేపు బైఠాయించి నిరసన తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ, సరిపడా ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరానికి బస్తా చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, నాగోరావ్, రూప్‌దేవ్, చంద్రశేఖర్, కాంబ్లె ఉద్ధవ్, ఫిరోజ్‌ఖాన్, సయ్యద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: స్థానిక పీఏసీఎస్ అనుబంధ కేంద్రానికి ఎరువుల లోడ్ వచ్చిందనే సమాచారంతో రైతులు ఉదయాన్నే మండల కేంద్రానికి చేరుకున్నారు. వేకువజామున 5 గంటల నుంచే బారులు తీరారు. నిర్వాహకులు ఉదయం 10 గంటలకు టోకెన్లు జారీ చేశారు. అయితే ఇదివరకు యూరియా తీసుకున్న వారికి నిరాకరించడంతో గందరగోళం నెలకొంది. ఏఎస్సై పూజ సిబ్బందితో వచ్చి రైతులను సముదాయించారు.

- నార్నూర్ మండలంలోని సుంగాపూర్ గ్రామంలో కొడప దేవ్‌రావు తన పంట చేనులో గంజాయి సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. 95 మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి 12.4 కిలోలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో పోలీసులు ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. నార్కొటిక్ డాగ్ రోమా సాయంతో తనిఖీ చేయగా ఓ ఇంట్లో 10 గ్రాముల ఎండు గంజాయి లభించింది. అలాగే మరో ఇంట్లో మూడు గంజాయి మొక్కలు కనిపించాయి. దీంతో వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.



గంజాయిపై నిఘా

- ఫోకస్ పెంచిన పోలీసులు
- జిల్లాలో వరుసగా తనిఖీలు
- పట్టుబడుతున్న సరుకు, మొక్కలు
- సాగు చేస్తున్న వారిపై కేసులు


ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో గంజాయి సాగుపై పోలీసులు ఫోకస్ పెంచారు. ఇటీవల వరుసగా తనిఖీలు చేపడుతూ పంట సాగు చేస్తున్న వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. కేసులు నమోదు చేస్తూ కటకటాల్లోకి పంపుతున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు సైతం నిలిపివేసేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులతో కలెక్టర్ గతంలో ఇదే అంశంపై సమీక్షించి గంజాయి సాగు చేసినా, విక్రయించినా, తరలించినా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ మేరకు బేల, జైనథ్, బోథ్ తదితర మండలాల్లో పంట సాగు చేస్తున్న రైతుల వివరాలు సేకరించి వ్యవసాయ శాఖకు నివేదిక అందించారు. వారిపై కేసుల నమోదుతో పాటు రైతు బీమా, రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాలను సైతం నిలిపివేశారు.

అడ్డదారులు తొక్కుతూ..

ఓ వైపు గంజాయి అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపడుతుండగా కొంత మంది అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. అమాయక రైతులకు డబ్బుల ఆశ చూపి ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మారుమూల మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఈ మొక్కలు సాగయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. పత్తి, సోయాలో అంతర పంటగా, మరికొన్ని చోట్ల ఇంటి పెరటిలోనూ సాగయ్యేలా చూస్తున్నారు. ముఖ్యంగా ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, భీంపూర్, బజార్‌హత్నూర్, బోథ్, తాంసి, తలమడుగు తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది.

యువతను మత్తులో దించుతూ..

గంజాయికి అలవాటుపడ్డ వారికి కొందరు నిత్యం చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. యువత వాటిని సిగరేట్లలో వేసుకొని పీల్చుతూ మత్తులో తూగుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, ఖుర్షీద్‌నగర్, తిర్పెల్లి, ఖానాపూర్, బస్టాండ్, ఏరోడ్రామ్ తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. ఇటీవల వన్‌టౌన్, టూటౌన్, సీసీఎస్ పోలీసులు విక్రయదారులను పట్టుకుని అరెస్టు చేస్తున్నప్పటికీ ఇంకా చాలా మంది తీరులో మార్పు రావడం లేదు. గ్రాము, రెండు గ్రాముల ప్యాకెట్లను తయారు చేసి రూ.100 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు. కాగా, గంజాయి సేవించిన యువత గొడవలకు పాల్పడడమే కాకుండా కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు సైతం ఉన్నాయి.



నార్నూర్‌లోని పంట చేలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలు

కోడ్ చెప్పు.. గంజాయి పట్టు

జిల్లా కేంద్రంలో అక్రమార్కులు విభిన్న రీతిలో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. రహస్య ప్రదేశాల్లో ప్యాకెట్లను ఉంచుతున్నారు. కావాలనుకునే వారికి ముందుగానే ఓ కోడ్ కేటాయిస్తున్నారు. సదరు వ్యక్తి ఆ కోడ్ చెబితేనే ప్యాకెట్ అందించి డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం. హోటళ్లు, పాన్‌షాపులు, మైదాన ప్రాంతాల్లో కొంత మంది కూర్చొని వీటిని కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు సమాచారం మేరకు అప్పుడప్పుడు పోలీసులు దాడులు చేస్తున్నారు.

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు



జిల్లాలో గంజాయి సాగు చేసినా, విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటాం. కేసుల నమోదుతో పాటు ప్రభుత్వ పథకాలు అందకుండా కలెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నాం. ఇప్పటికే పలువురికి సంక్షేమ పథకాలను నిలిపివేశాం. ఎక్కడైనా గంజాయి సాగు చేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– ఎల్.జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

'బఫర్' పరిధిలోని ఇళ్లకు నోటీసులివ్వాలి

- అధికారులతో సమీక్షించిన కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: బఫర్ జోన్ పరిధిలో ఉన్న నివాసాలు, నాలాలపై ఉన్న నిర్మాణాలు గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో వరదనష్టంపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించే సర్వే వివరాలను పవర్ పాయింట్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పొంగి ప్రవహించిన ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్, కోజా కాలనీ, సుభాష్‌నగర్ లోలెవల్ బ్రిడ్జిలను హైలెవెల్ బ్రిడ్జిలుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఆర్అండ్‌బీ, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలాలపై ఉండే అక్రమ నిర్మాణాలు, ఇరుకుగా మార్చిన ప్రదేశాలను పరిశీలించి నివేదిక అందించాలన్నారు. సెప్టెంబర్ 10న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఇందులో ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు, ఇరిగేషన్ డీఈ విఠల్, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్లు, ఆశా కార్యకర్తలు, వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం చేపట్టిన ఆందోళనలతో కలెక్టరేట్ సోమవారం దద్దరిల్లింది.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కమీషన్ విడుదల చేయాలని రేషన్‌డీలర్లు..

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేషన్ డీలర్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి వేణుగోపాల్ మాట్లాడుతూ.. నెలల తరబడి కమీషన్ విడుదల చేయకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా డీలర్లకు రూ.5వేల గౌరవ వేతనంతో పాటు క్వింటాల్ బియ్యంకు రూ.300 కమీషన్ చెల్లించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘ బాధ్యులు వెంకటేశ్, హరీంద్ర, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం కోసం ఆశావర్కర్లు ..

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ, ఆశాలకు రూ.18వేలు కనీస వేతనం చెల్లించాలని, అలాగే అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ వారి వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించడంతో ఆందోళన విరమించారు. ఇందులో సంఘబాధ్యులుపాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం..

భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామంలో వరద బాధితులకు పరిహారంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.మల్లేశ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ధర్నాలో మాట్లాడారు. అధికారులు సర్వే క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో నాయకులు దత్తాత్రి, మంజుల, స్వామి, ఆరిఫా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీ



కైలాస్‌నగర్: జిల్లాలో రెవెన్యూ శాఖ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పని చేస్తున్న 15 మంది కంప్యూటర్ ఆపరేటర్ల (మీసేవ)కు స్థానచలనం కలిగింది. పాలన సౌలభ్యం పేరిట వారిని బదిలీ చేస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే బదిలీ స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

పేరు	ప్రస్తుత మండలం	బదిలీ స్థానం
ఆసీఫ్	ఆదిలాబాద్‌అర్బన్	గుడిహత్నూర్
దయాకర్	ఆదిలాబాద్‌రూరల్	జైనథ్
కార్తీక్	నేరడిగొండ	ఆదిలాబాద్‌అర్బన్
సాయి	తలమడుగు	భీంపూర్
అశన్న	బజార్‌హత్నూర్	బోథ్
ఇనేష్	గుడిహత్నూర్	భోరజ్
హిమేశ్	భీంపూర్	తలమడుగు
అనిల్	మావల	బేల
శ్రీనివాస్	బేల	తాంసి
లక్ష్మణ్	భోరజ్	నేరడిగొండ
ప్రవీణ్	బోథ్	బజార్‌హత్నూర్
రిజ్వాన్	జైనథ్	ఆదిలాబాద్‌రూరల్
ప్రశాంత్	తాంసి	మావల
మిథున్	ఉట్నూర్	నార్నూర్
జరాచంద్	నార్నూర్	ఉట్నూర్

ముగిసిన శబరిమాత అఖండజ్యోతి



పల్లకీయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా నెలరోజుల పాటు నిర్వహించిన శబరిమాత అఖండ జ్యోతి ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. మన సంస్కృతిని భావితరాలకు అందించాలన్నారు. అనంతరం పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం, బీజేపీ మండల అధ్యక్షుడు ధనంజయ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల వెల్లువ

- ఈ వారం ప్రజావాణికి 139 దరఖాస్తులు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్
- సత్వరం పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



బాధితుల సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కొందరు.. సాగుభూములకు పట్టాలివ్వాలని మరికొందరు.. పంటలకు నష్ట పరిహారం అందించాలని ఇంకొందరు.. ఇలా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తమ గోడు వెల్లబోసుకున్నారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 139 అర్జీలు అందాయి. అందులో కొందరి ఆవేదన..

సాగుభూములకు పట్టాలివ్వాలి



సార్.. మాది గాదిగూడ మండలం రాంపూర్ గ్రామం. మేమంతా ఆదివాసీ రైతులం. గ్రామ శివారులోని పలు సర్వేనంబర్లలో గల భూములను 15 మంది రైతులం తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నాం. అయితే అధికారులు ఇప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదు. వాటి కోసం ఏళ్లుగా తిరుగుతూనే ఉన్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. రైతుభరోసా, పంట రుణాలు వంటి ఎలాంటి సర్కారు సాయం అందడం లేదు. త్వరగా పట్టాలు జారీ చేసి న్యాయం చేయాలని కోరుతున్నాం.

బేస్‌మెంట్ కట్టాక రద్దు చేశారు..



మాది ఆదిలాబాద్ పట్టణం 12వ వార్డు పరిధిలోని '170 కాలనీ'. అర్హులైన మాకు అధికారులు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందించారు. దీంతో ఉన్న ఇళ్లను తొలగించి నిర్మాణాలు చేపట్టాం. బేస్‌మెంట్ వరకు కట్టుకున్నాం. ఇప్పుడు డబుల్ పట్టాలు ఉన్నాయనే కారణంతో 26 మంది ఇళ్లను అధికారులు రద్దు చేశారు. ఎంపిక సమయంలో పట్టాలు చూసి మంజూరు చేసిన అధికారులు తీరా పనులు సాగుతున్న సమయంలో రద్దు చేయడం సరికాదు. మా ఇళ్లను యథావిధిగా పూర్తిచేసుకునేలా ప్రభుత్వ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు..



భోరజ్ మండలంలోని హత్తిఘాట్, గిమ్మ, కొరటా, గూడ శివారుల్లోని పలు సర్వే నంబర్లలో గల గౌరి శంకర్‌కు సంబంధించిన వందలాది ఎకరాల భూములు సాగుకు యోగ్యంగా లేవు. చిన్నపాటి అడవులుగా మారాయి. కొంతమంది బినామీల పేర్లతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. పదేళ్లుగా ఎలాంటి పంటలను సాగు చేయనప్పటికీ ఆ పట్టాలు ఉపయోగించి రైతుబంధు, రుణాలు వంటి ప్రభుత్వ సాయం పొందుతున్నారు. దీనిపై విచారణ జరిపించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. – గూడ గ్రామస్తులు, భోరజ్

క్లుప్తంగా

గుడుంబా విక్రేతలపై కేసు

నెన్నెల: గుడుంబా తయారు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్న చిన్నలంబాడితండాకు చెందిన పాల్తె వెంకానాయక్, జాటోత్ శ్రీనివాస్, పెద్ద లంబాడితండాకు చెందిన దరావత్ స్వప్నపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తండాల్లో నాటుసారా తయారు చేసి ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. వారి నుంచి గుడుంబాతోపాటు రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

చిరుతపులి దాడిలో మేక మృతి

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేకల మందపై సోమవారం చిరుతపులి దాడి చేసింది. కొత్తపల్లికి చెందిన పవార్ రవీందర్ మేకలను సోమ్లా అనే కాపరి మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం పూట చిరుతపులి ఒక్కసారి మేకపై దాడి చేసి హతమార్చింది. కాపరి భయపడి దాక్కున్నాడు. అనంతరం అతడు గ్రామస్తులకు విషయం తెలియజేయగా, వారు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిరుతపులి దాడి చేసి మేకను చంపినట్లు జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ నిర్ధారించారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం బాబాసాగర్– కొత్తగూడ గ్రామాల మధ్య రహదారిపై సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాబాసాగర్‌కు చెందిన పొట్టి సంతోష్ కొత్తగూడెం నుంచి బాబాసాగర్ గ్రామానికి బైక్‌పై వస్తుండగా.. బాబాసాగర్ గ్రామానికి చెందిన ఎల్ములే వెంకటేశ్ మరో బైక్‌పై స్వగ్రామం నుంచి కొత్తగూడెంకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరి తలలతో చేతులు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్మీలో ఉద్యోగం సాధించిన యువతికి ఘన స్వాగతం



యువతికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: ఆర్మీలో ఉద్యోగం సాధించిన యువతికి ఆ గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఉట్నూర్ మండలం శ్యాంనాయక్‌తండా పంచాయతీ పరిధి శంకర్‌తండాకు చెందిన బానోత్ శాంఖాబాయి 2024లో ఆర్మీలో ఉద్యోగం సాధించింది. శిక్షణ పూర్తి తర్వాత ఇటీవల ఉద్యోగంలో చేరింది.సోమవారంగ్రామానికి చేరుకోగా స్థానికులు ఘనస్వాగతం పలికారు.

మహిళ అదృశ్యం

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేటకు చెందిన మహిళ కనిపించడం లేదదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాడి శాంతి(40)కి కొన్నిరోజులుగా మతి స్థిమితం సరిగా ఉండడం లేదు. ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శాంతి తిరిగి రాలేదు. రెండు రోజులుగా కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో ఆమె భర్త శంకర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీపీఎంలకు కొత్త ఫోన్లు

- పింఛన్ పంపిణీ కోసం అందజేత
- ఉమ్మడి జిల్లాకు 579 మొబైల్స్ సరఫరా

జిల్లా	కేటాయించినసెల్‌ఫోన్లు
ఆదిలాబాద్	158
నిర్మల్	147
మంచిర్యాల	144
కుమురంభీం ఆసిఫాబాద్	130



బీపీఎంకు అందించే సెల్‌ఫోన్, ఇతర పరికరాలు

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత (చేయూత) కింద లబ్ధిదారులకు ప్రతీ నెలా పింఛన్ పంపిణీ చేస్తోంది. బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ల (బీపీఎం) ద్వారా వీటిని అందజేస్తారు. ఈ మేరకు బీపీఎంలకు కొత్త సెల్‌ఫోన్లను అందించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 579 ఆండ్రాయిడ్ మొబైల్స్ సరఫరా చేసింది. ఇప్పటికే అన్ని జిల్లా కేంద్రాలకు చేరుకున్నాయి. వాటిని మంగళవారం ఆయా కలెక్టర్ల ఆధ్వర్యంలో అందజేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన ఈ ఫోన్లు పింఛన్ పంపిణీకి మాత్రమే ఉపయోగపడతాయి.

అక్రమాలు అరికట్టేలా ...

వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత కార్మికులు, డయాలసిస్ పేషెంట్లు, బోధకాలు, హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం ప్రతినెలా చేయూత కింద పింఛన్లు అందజేస్తోంది. దివ్యాంగులకు రూ.3,016 అందిస్తుండగా, మిగతా వారికి రూ.2,016లను అందజేస్తోంది. పంపిణీలో అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో గత నెల నుంచి ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. యాప్ ద్వారా లబ్ధిదారుల కళ్లను స్కాన్ చేసి పింఛన్ అందజేస్తున్నారు. సిబ్బందికి గత నెలలోనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన సెల్‌ఫోన్లు అందించాల్సి ఉండగా ఆలస్యమైంది. ప్రస్తుతం కొత్త మొబైల్స్ జిల్లాలకు చేరగా వాటిని అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 579 మంది బీపీఎంలు చేయూత పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. వీరికి 5జీతో కూడిన సెల్‌ఫోన్లను ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే అన్ని జిల్లా కేంద్రాల్లోని డీఆర్‌డీఏ కార్యాలయాలకు ఈ ఫోన్లు చేరాయి. బీపీఎం పేరు, వారికి అందిస్తున్న ఫోన్ ఈఎంఐ నంబర్ వంటి వివరాలను ఆ శాఖ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మంగళవారం ఆయా కలెక్టర్ల ద్వారా బీపీఎంలకు అందించనున్నారు. సెల్‌ఫోన్‌తోపాటు చార్జర్, బ్యాక్ కవర్, ఫింగర్ ప్రింట్స్ నమోదు చేసే యంత్రాన్ని సైతం అందజేస్తున్నట్లు డీఆర్డీవో రాథోడ్ రవీందర్ తెలిపారు. సెల్ ద్వారా పింఛన్‌దారు ముఖ చిత్రాన్ని స్కాన్ చేసి వారికి నగదు అందజేస్తారని పేర్కొన్నారు.

ఎలుగుబంటి దాడిలో కూలీకి గాయాలు



గాయాలతో భూమయ్య

తిర్యాణి(ఆసిఫాబాద్): ఎలుగుబంటి దాడిలో ఓ వ్యవసాయ దినసరి కూలీకి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన ఆవుల భూమయ్య వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన పశువుల కాపరి వేరే ఊరికి వెళ్లడంతో భూమయ్య సోమవారం పశువుల మేపేందుకు ఎదులపహాడ్ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో పొదల్లో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా భూమయ్యపై దాడి చేసింది. దీంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి అరుపులు విన్న సమీపంలోని పాటగూడ గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుడిని ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన శోభన్

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి సోమగూడెం భరత్‌కాలనీకి చెందిన మల్లెపల్లి శోభన్(42) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలానికి చెందిన శోభన్ సోమగూడెంలో నివాసం ఉంటూ ఆటోరిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తలు గొడవ పడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన శోభన్ ఆదివారం ఉదయం 9.30గంటలకు పురుగుల మందు తాగాడు. మంచిర్యాల ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి సోదరుడు మల్లెపల్లి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ముల్కల్ల వాగొడ్డుపల్లెకు చెందిన కొట్టె బాపన్న(51) ఆత్మహత్య చేసుకున్నాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపన్న వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నడుం నొప్పి తీవ్రంగా ఉండడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. వ్యవసాయం, కూలీ పనులకు వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. పదేళ్ల క్రితం బాపన్న కుమారుడు చనిపోవడం, తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురై 24న సాయంత్రం 4గంటల ప్రాంతంలో ముల్కల్ల శివారులో గడ్డి మందు తాగాడు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె లలిత ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలింతకు దారి కష్టాలు

బోథ్: సొనాల మండలంలోని పెద్దగూడ గ్రామానికి చెందిన రేణుక బోథ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. తల్లీబిడ్డను పెద్దగూడకు 102 వాహనంలో తరలిస్తుండగా గ్రామానికి చేరువలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో పైలట్ భగత్ నవీన్ కుమార్ పసికందుతో పాటు తల్లిని తీసుకుని జాగ్రత్తగా వాగు దాటించాడు. వారిని క్షేమంగా ఇంటికి చేర్చాడు. కాగా, వంతెన లేక ఆదివాసీల ఇక్కట్లకు ఈ ఘటన ఓ నిదర్శనం.



పసికందుతో బాలింతను వాగు దాటిస్తున్న నవీన్

రైలు కిందపడి వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్ కాలనీ సమీపంలో ఫ్లెటైవర్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు మంచిర్యాల వైపు నుంచి బెల్లంపల్లి వైపు వెళ్లే రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతిచెందాడని పేర్కొన్నారు. మృతదేహం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉందని, సంబంధీకులు 9490871784, 9948481902 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రిటైర్డు కార్మికుడు మృతి



నారాయణ(ఫైల్)

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని తీగల్ పహాడ్ రాంనగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు దొరిశెట్టి నారాయణ(62) సోమవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ రామ్‌నగర్‌లో నిర్మించుకుంటున్న ఇంటికి నీరు పట్టేందుకు బోర్ మోటార్ స్టార్టర్ స్విచ్చాన్ చేయబోయాడు. ఈ క్రమంలో కరెంటు వైరు షాక్ తగలడంతో కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందాడని ధ్రువీకరించారు. మృతుడి భార్య మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సుంగాపూర్ శివారులో 95 గంజాయి మొక్కలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

నార్నూర్: ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని సుంగాపూర్ శివారులో గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన సమాచారంతో సీసీఎస్, నార్నూర్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన కొడప దేవ్‌రావు సాగు చేస్తున్న 95 గంజాయి మొక్కలను స్వాధీనపరుచుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. 12.4 కిలోల బరువు గల వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.9.5 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. నార్నూర్ సీఐ ప్రభాకర్, ఎస్సై అఖిల్, సీసీఎస్, పోలీసులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను హతమార్చిన ఇద్దరి అరెస్ట్



మాంసంతో పట్టుబడిన నిందితులు

సాత్నాల: వన్యప్రాణులను వేటాడిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్‌వో గులాబ్ సింగ్ తెలిపారు. మహారాష్ట్రలోని పాంఢ్రకోడా అటవీ పరిసర ప్రాంతాల్లో నాలుగు నెమళ్లు, ఓ నిలుగాయిని పలువురు వేటాడి హతమార్చారు. మహారాష్ట్ర పార్వ గ్రామానికి చెందిన నిలేష్ చౌహాన్, రాథోడ్ రోహాన్ పట్టుబడగా, భోరజ్ మండలం గిమ్మ గ్రామానికి చెందిన సందీప్ రాథోడ్, సంజీవ్ పరారీలో ఉన్నారు. హతమార్చిన వన్యప్రాణుల మాంసాన్ని గిమ్మ గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎఫ్ ఆర్వో తెలిపారు. వన్యప్రాణుల పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

శ్రీరాంపూర్: కంపెనీ నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. అధికారులతో కలిసి క్వారీలో దిగి పని స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన ఓవర్ బర్డెన్ మట్టిని తొలగించాలన్నారు. ఓబీ సంస్థలు తమ లక్ష్యాన్ని అనుగుణంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్, ఎస్సార్పీ ఓసీపీ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయించే యువకుడు అరెస్ట్


మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో గంజాయి విక్రయించేందుకు యత్నించిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మంచిర్యాలకు చెందిన గూడెల్లి సాయికుమార్ అనుమానాస్పందగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. అతడి వద్ద 205 గ్రాముల గంజాయి లభించిందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని బల్లార్షకు వెళ్లి గంజాయి కొనుగోలు చేశాడని, కొందరికి విక్రయించేందుకు వచ్చాడని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250. మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుండి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

ఆర్జీయూకేటీలో ముగిసిన వర్క్‌షాప్



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాసర:బాసర ఆర్జీయూకేటీలో ఎలక్ట్రిక్ వాహనాలపై మూడు రోజులు నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. నేషనల్ మిషన్ ఆన్ పవర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ సహకారం అందించిందని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. ప్రపంచం వేగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు పయనిస్తున్న ఈ సమయంలో ఆర్జీయూకేటీ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు, ప్రయోజనాత్మక అనుభవం అందించడం అత్యంత అవసరమన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు కేవలం శిక్షణ కార్యక్రమాలు మాత్రమే కాకుండా, భవిష్యత్ ఆవిష్కరణలకు పునాదిగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు, పరిశ్రమల నుంచి వచ్చిన విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సహా మొత్తం 75 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. దేశ స్వచ్ఛ శక్తి, ఎలక్ట్రిక్ మొబిలిటీ లక్ష్యాలకు తోడ్పడే విధంగా నైపుణ్యాలు పెంపొందించడానికి వర్క్‌షాప్ దోహదపడిందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ లక్ష్మణ్ ముత్యం, హెచ్‌వోడీ డాక్టర్.బావుసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ పీఆర్వోగా బాలకృష్ణ



పీఆర్‌వో డాక్టర్ బాలకృష్ణ

బాసర: బాసర ఆర్జీయూకేటీ నూతన పీఆర్వోగా డాక్టర్ బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. గతంలో డాక్టర్ విజయకుమార్ పీఆర్వోగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో ప్రస్తుతం డాక్టర్ బాలకృష్ణను నియమించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో జరిగే వివిధ కార్యక్రమాలతోపాటు విద్యాపరంగా, సంస్కృతి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందజేస్తారని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు రిలే నిరాహార దీక్ష



రిలే దీక్షలో బీసీ సంఘాల నాయకులు

జన్నారం: బీసీ రిజర్వేషన్ల సాధనకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కడార్ల నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. విద్య, ఉద్యోగ పదోన్నతులు, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే బహిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంధ్ర పురుషోత్తం, మున్నూరు కాపు సంఘం పొనకల్ పట్టణ ఉపాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పాడేటి సతీష్, డివిజన్ మోకు దెబ్బ అధ్యక్షుడు ఒల్లాల నర్సాగౌడ్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు

బోధనోపకరణాలతో విద్యార్థుల్లో ఆసక్తి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

కాసిపేట: బోధనోపకరణాలు విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తిని పెంపొందిస్తాయని, విద్యాప్రమాణాల మెరుగుదలకు దోహద పడతాయని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి బోధనోపకరణాల మేళా(టీఎల్‌ఎం)ను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు చౌదరి సత్యనారాయణమూర్తి, విజయలక్ష్మి, మండల విద్యాధికారి ముక్తవరం వెంకటేశ్వరస్వామి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మామిడిపల్లి సాంబమూర్తి, రమేష్ రాథోడ్, సుధాకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రో ఖోఖో లీగ్‌కు మడావి ప్రశాంత్



ప్రశాంత్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం చిన్నగూడకు చెందిన మడావి ప్రశాంత్ అల్టిమేట్ ప్రో ఖోఖో లీగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని ఉట్నూర్‌లో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి సోమవారం సన్మానించారు. స్థానిక కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదివి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రశాంత్‌ను పలువురు అభినందించారు. ఇందులో సీనియర్ పీడీ హేమంత్, కోచ్‌లు కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై కేసు

గుడిహత్నూర్: అనుమతి లేకుండా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకోలో పాల్గొన్న 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రహదారిపై బైఠాయించడంతో ప్రజా రవాణాతో పాటు భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. జాతీయ రహదారి సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎలుగుబంటి వేటగాళ్ల రిమాండ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని కోయచిచ్చాల అటవీ ప్రాంతంలో ఎలుగుబంటిని వేటాడిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు అటవీశాఖ అధికారులు సోమవారం తెలిపారు. పదిరోజుల క్రితం ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. సోమవారం పెంచికల్‌పేట్‌కు చెందిన వెంకటి, సామెర సత్తన్న, ఎల్లూర్‌కు చెందిన మధునయ్యను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎఫ్ఎస్‌వో జగన్, ఎఫ్‌బీవో సతీష్ వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడితే చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.